సాక్షి
నల్లగొండ
గురువారం, 16, మే, 2024



అధిక వడ్డీ ఆశ చూపి..
రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ ఇస్తామని ఆశచూపి మోసం చేసింది పుడమి ప్రాజెక్టు సంస్థ.
- 8లో



24న వరి విత్తన మేళా
కంపాసాగర్ కేవీకేలో ఈనెల 24న వరి విత్తన మేళా నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ తెలిపారు.
- 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
37^{0} / 26^{0}
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

17 నుంచి డిగ్రీ పరీక్షలు

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 17వ తేదీ నుంచి డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు.. ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ల రెగ్యులర్, బ్యాక్‌లాగ్, 1, 3, 5 సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు జాతీయ డెంగీ నివారణ దినం

నల్లగొండ టౌన్ : జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16న గురువారం జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించనుంది. వర్షాకాలం ఆరంభమవుతున్న నేపథ్యంలో దోమల వ్యాప్తిని నివారించేందుకు ప్రజల్లో అవగాహన కలిగించేలా ర్యాలీలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది. ఇందులో భాగంగా అధికారులు నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని కూలర్లు, పాతకుండలు, తొట్లు, డబ్బాలు, కొబ్బరి చిప్పల్లో నిలిచిన నీటిని తీసివేసి దోమలు గుడ్లు పెట్టకుండా అవగాహన కల్పించనున్నారు. ప్రతి శుక్రవారం ప్రజలు స్వచ్ఛందంగా డ్రై డేగా పాటించి నీటి నిల్వ తొలగించేలా ప్రచారం చేయనున్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసేలా ప్రజల్లో చైతన్యం కలిగించనున్నారు. తద్వారా డెంగీ, చికున్‌గన్యా, విష జ్వరాలు బారిన పడకుండా చూడనున్నారు. గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, మలేరియా సిబ్బంది పాల్గొననున్నారు.

18న ప్రతిభ పురస్కారాల అందజేత

రామగిరి(నల్లగొండ) : గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, జ్ఞాన ప్రతిష్ట ఆధ్వర్యంలో ఈ నెల 18న ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్లు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో టాపర్స్‌గా నిలిచిన వివిధ పాఠశాలల చెందిన 79 విద్యార్థులకు, విద్యా రంగంలో విశిష్ట సేవలందించిన 27 మంది ప్రధానోపాధ్యాయులకు ప్రతిభా పురస్కారాలు ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు.

నారసింహుడికి సంప్రదాయ పూజలు


స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామునే సుప్రభాత సేవ, అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అర్చన, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ముఖమండపంలో అష్టోత్తరం, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.

శాలివాహన అన్నదాన సత్రం నూతన కమిటీ ఎన్నిక


మట్టపల్లిలో సమావేశమైన కమిటీ సభ్యులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల శాలివాహన (కుమ్మరి) అన్నదాన సత్రం కమిటీ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొట్టం సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా మామిడి రామారావు, కోశాధికారిగా మల్లికంటి మట్టపల్లిరావు, ఉపాధ్యక్షులుగా సేగ్యం శ్రీనివాస్, గొల్లపెల్లి కోటయ్య, సహాయ కార్యదర్శులుగా కొలిపాక కృష్ణ, సలికంటి రాజారావు, చీర్లదిన్నె ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంజీవరావు మాట్లాడుతూ.. సత్రం అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈనెల 21 నుంచి 26 వరకు జరగనున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే తెలుగు రాష్ట్రాల శాలివాహన భక్తులకు భోజన వసతి కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇక.. ఎమ్మెల్సీ పోరు


తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు



హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్, చిత్రంలో అభ్యర్థి రాకేష్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, నామా, పల్లా తదితరులు

- సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న పార్టీలు
- గెలుపే ధ్యేయంగా నేతలకు దిశానిర్దేశం
- బరిలో 52 మంది అభ్యర్థులు
- 27వ తేదీన పోలింగ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ పూర్తయింది. ఇక, జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోరుకు పార్టీలు సిద్ధమవుతున్నాయి. నల్లగొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ ఈ నెల 27వ తేదీన జరుగనుంది. ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీలు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో పాటు నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక బరిలో ఉన్న అభ్యర్థులను ప్రకటించారు. పోటీలో 52 మంది అభ్యర్థులు ఉన్నారు. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీలో ఉన్నందున అధికారులు బ్యాలెట్ పేపర్ ముద్రణకు పంపారు. పోలింగ్ రోజున జంబో బ్యాలెట్ బాక్సులు ఉపయోగించనున్నారు.

సమావేశాల్లో పార్టీల బిజీ..
ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి సారించిన ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపే ధ్యేయంగా ముందుకెళ్తున్నాయి. ఇప్పటికే పలు పార్టీలు సన్నాహక సమావేశాలను నిర్వహించాయి. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి కె.తారక రామారావు హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన రోజున కూడా ఆపార్టీ పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించింది.

- కాంగ్రెస్ పార్టీ అన్ని జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలకు శ్రీకారం చుట్టింది. బుధవారం తుంగతుర్తి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు.
- బీజేపీ కూడా సన్నాహక సమావేశాలకు సిద్ధమైంది. ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నేతృత్వంలో తమ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపుకోసం బీజేపీ ఇటీవల సన్నాహక సమావేశం నిర్వహించింది. ఆయన నామినేషన్ వేసిన సందర్భంగా ముఖ్య నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది.

సిద్ధమైన ఓటరు జాబితా
ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేసింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభానికి పది రోజుల ముందుగానే ఓటర్ల లెక్క తేల్చింది. నల్లగొండ - ఖమ్మం - వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పరిధిలోకి వచ్చే నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 4,61,806 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చింది. వారు ఈనెల 27వ తేదీన జరిగే పోలింగ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్ బొజ్జా

నల్లగొండ : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జిల్లా సాధారణ పరిశీలకుడు రాహుల్ బొజ్జా పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి సమస్యలు, ఫిర్యాదులు, సందేహాలు ఉంటే 9866377107 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలను భయపెట్టొద్దని, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఇచ్చే రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. కలెక్టర్, పట్టభద్రుల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు పూర్తిస్థాయిలో ప్రచారాన్ని నిర్వహించుకోవచ్చని.. అందుకు ఆయా జిల్లాల్లోని ఏఆర్‌ఓల ద్వారా ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గం మొత్తం ప్రచారానికి అనుమతి మాత్రం నల్లగొండ కలెక్టర్ నుంచి తీసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే 1950, 1800425144 నంబర్ల ద్వారా తెలియజేయవని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, నల్లగొండ ఆర్డీఓ రవి తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశాం..
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని కలెక్టర్ దాసరి హరిచందన పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో బ్యాలెట్ బాక్స్‌లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఏఆర్ఓలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ నిర్వహించాలని, అభ్యర్థులకు మాన్యువల్‌గా అనుమతులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఏఆర్ఓ శ్రీనివాసరావు, చండూరు ఏఆర్ఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అసంపూర్తిగా డిజిటల్ సర్వే!

- పట్టణాల్లో ఇంటి నంబర్ల సర్వే నిలిపివేసిన కాంట్రాక్ట్ సంస్థలు
- ఏ నిర్ణయమూ తీసుకోని ప్రభుత్వం
- సర్వే పూర్తయితే మున్సిపాలిటీలకు పెరగనున్న ఆదాయం



నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీల్లో గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ డోర్ నంబర్ల సర్వే అర్థాంతరంగా నిలిచిపోయింది. పూర్తి వివరాలు అందజేయకుండా సంబంధిత కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారు. సర్వే ప్రారంభమై ఏడాదిన్నర దాటినా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. క్షేత్ర స్థాయిలో దాదాపు 80 శాతం సర్వే పూర్తయినట్లు సర్వే సంస్థ చెబుతున్నా అంతా అసంపూర్తిగానే ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. సర్వే నిక్కచ్చిగా, పారదర్శకంగా చేపడితే పట్టణాల్లో 80 నుంచి 90 శాతం వరకు భవనాల ఆస్తి పన్ను పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో కాంట్రాక్ట్ సంస్థలు సర్వేనే పూర్తి చేయలేకపోయాయి. ఎన్నికల ముందు సర్వే నిలివేయగా.. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.



ఇంటి పూర్తి వివరాలు తెలిసేలా..
జిల్లాలోని నీలగిరి, మిర్యాలగూడ తదితర ప్రధాన పట్టణాల్లో డిజిటల్ డోర్ నంబర్లు ఇవ్వాలని గత ప్రభుత్వం సర్వే చేపట్టింది. డబుల్ ఇంటి నంబర్లు, పేర్లు తప్పు, ఇంటి నంబర్లు తప్పు, ఆస్తిపన్నులో తేడాలు తదితర వాటికి స్వస్తి చెప్పాలనే నిర్ణయంతో పాటు ఇంటి నంబర్ చూస్తే ఇంటి పూర్తి వివరాలు తెలిపే విధంగా డిజిటల్ డోర్ నంబర్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొదట్లో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని సర్వే చేపట్టింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు కాంట్రాక్ట్ సంస్థ సర్వే నిలిపివేసింది. సర్వే ఎందుకు నిలిపివేశారన్న దానిపై మున్సిపల్ అధికారులకు కూడా ఎలాంటి స్పష్టత లేదు. ఒక్క నీలగిరి మున్సిపాలిటీలోనే డిజిటల్ డోర్ నెంబర్ సర్వే చేయడానికి రూ.1.50 కోట్లు వెచ్చించింది. ఇలా ప్రధాన పట్టణాల్లో భారీ ఖర్చుతో సర్వే చేపట్టినా సకాలంలో పూర్తి చేయలేదు. అప్పటి ప్రభుత్వం ఉన్నట్టుండి సర్వే నిలిపివేయాలని అంతర్గత ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడినా.. ఈ సర్వేపై కదలిక లేకుండా పోయింది.

భారీగా పెరగనున్న పన్ను రాబడి..
డిజిటల్ డోర్ నంబర్ సర్వే పారదర్శకంగా చేస్తే దాదాపు 90 శాతం భవనాల ఆస్తి పన్ను పెరగనుంది. ఇంటి అనుమతి తీసుకోకుండా భవనాలు నిర్మించుకున్న వారితో పాటు, అనుమతి ఒక అంతస్తుకు తీసుకొని మూడు, నాలుగు అంతస్తుల భవనాలు నిర్మించడం, ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని వాణిజ్య భవనాలు నిర్మించడం లాంటివి పట్టణాల్లో వందల సంఖ్యలో ఉన్నాయి. ఇలాంటి భవనాలకు మున్సిపల్ చట్టం ప్రకారం విధించే పన్నుకు రెట్టింపు వేయాల్సి ఉంటుంది. డిజిటల్ డోర్ నంబర్ సర్వే పూర్తి చేస్తే మున్సిపాలిటీలకు ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉంది. కానీ సర్వే సంస్థ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం, చేసిన సర్వే వివరాలను మున్సిపల్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. పన్ను పెరిగిన యజమానులకు నోటీసులు ఇవ్వడం వంటి ప్రక్రియ చెప్పట్టాలి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే ముందుకుపోయే అవకాశం ఉన్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

ప్రతి ఉద్యోగి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీదేవి

నల్లగొండ రూరల్ : ప్రతి ఉద్యోగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే విధి నిర్వహణ సమర్థవంతంగా ఉంటుందని ఆర్టీసీ నల్లగొండ ఆర్ఎం శ్రీదేవి పేర్కొన్నారు. రెండవ విడత గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌లో భాగంగా బుధవారం నల్లగొండ డిపోలోని ట్రైనింగ్ కేంద్రంలో సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అన్ని డిపోల్లో సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం మాధవి, శివశంకర్, డీఎం రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలో కాంగ్రెస్‌కు అత్యధిక మెజారిటీ

- మాజీ మంత్రి జానారెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి జానారెడ్డి

మిర్యాలగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనే నల్లగొండ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ వస్తుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి చెప్పారు. బుధవారం అయన మిర్యాలగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ స్థానంలో 3.50 లక్షల నుంచి 5.50 లక్షల వరకు మెజారిటీ రావడం ఖాయమన్నారు. ఈ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు, ప్రజలుపార్టీ గెలుపునకు కృషి చేశారని, వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు సైతం తమ శక్తికి మించి అధిక మెజారిటీ కోసం పనిచేయడం హర్షణీయమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం తమవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవడంలో అన్ని వర్గాలు, అన్ని పక్షాలకు, వామపక్షాలకు, ప్రజా సంఘాల నాయకుల సేవలు మరువలేనివన్నారు. ఇండియా కూటమి దేశంలో అత్యధిక స్థానాలు గెలిచి అధికారం చేజిక్కించుకుంటుందన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు ఉపేందర్‌రెడ్డి, రామలింగం, అర్జున్, తలకొప్పుల సైదులు, మాధవి పాల్గొన్నారు.

రైతు భరోసా రూ.602.09 కోట్లు జమ

నల్లగొండ అగ్రికల్చర్ : యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు డబ్బులు ఎట్టకేలకు రైతుల రైతుల ఖాతాల్లో పూర్తిస్థాయిలో జమ అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 5,42,106 మంది రైతులకు రూ.624,14,84,629 జమ కావాల్సి ఉండగా.. మంగళవారం నాటికి 5,13,464 మంది రైతుల ఖాతాల్లో రూ.602,09,72,504 జమ అయ్యాయి. యాసంగి సీజన్‌కు ముందు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందస్తుగానే రైతుల ఖాతాల్లోకి రైతుభరోసా డబ్బులు జమ చేసేందుకు ట్రెజరీలో సిద్ధం చేసింది. అయితే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో డబ్బుల జమ నిలిచిపోయిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అదే నెల 12న రైతు భరోసా డబ్బులను జమ చేసే ప్రక్రియను ప్రారంభించింది. కానీ వివిధ కారణాల వల్ల పూర్తిస్థాయిలో డబ్బులు జమ కాలేదు. తిరిగి ఇటీవల డబ్బు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది.

యాదాద్రి కొండపై నూతన టాయిలెట్లు


యాదాద్రి కొండపై వీఐపీల కార్ల పార్కింగ్ ప్రాంతంలో నిర్మిస్తున్న టాయిలెట్లు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధికి వచ్చే మహిళా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. యాదాద్రి కొండపై మహిళల కోసం ప్రత్యేకంగా టాయిలెట్లు లేకపోవడతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల ఈఓ భాస్కర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొండపైన వీఐపీలు వాహనాలను పార్కింగ్ చేసే ప్రాంతంలో టాయిలెట్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుత క్యూ కాంప్లెక్స్‌లో ఉన్న మరుగుదొడ్లు, టాయిలెట్లను అర్చకులు, అధికారులు, సిబ్బందితో పాటు భక్తులు వినియోగిస్తున్నారు. దీంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. నూతనంగా ఐదు టాయిలెట్లను నిర్మిస్తున్నారు. వీటిని ఈనెలాఖరు నాటికి అందుబాటులో తీసుకురానున్నట్లు ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం

- 11.47 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేస్తారని అంచనా
- పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్న వ్యవసాయశాఖ
- విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసేలా కసరత్తు
- జూన్ మొదటి వారంలో ప్రారంభం కానున్న సాగు పనులు


నల్లగొండ సమీపంలో దుక్కి దున్నుతున్న రైతు

పంటల సాగు అంచనా ఇలా..

పంట	ఎకరాలు
వరి	5,19,160
పత్తి	5,40,000
కంది	4,710
పెసర	1,468
వేరుశనగ	1,145
ఇతరములు	80,517

నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సాగుకు జిల్లా వ్యవసాయశాఖ సన్నద్ధమవుతోంది. సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ముందస్తుగా సిద్ధం చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. గతంలో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొరతను ఎదుర్కొన్న నేపథ్యంలో ఈసారి అలాంటి సంఘటనలు పునరావృతంగా కాకుండా ముందుస్తుగానే పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి విత్తనాలు, ఎరువుల డీలర్లు, మార్క్‌ఫెడ్ వద్ద ఉన్న ఎరువులు, విత్తనాల నిల్వలను తనిఖీ చేస్తున్నారు. సొసైటీలు, డీలర్ల వద్ద ఉన్న డీఏపీ, యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల లభ్యతపై లెక్కలు వేశారు. సీజన్ ఆరంభానికి ముందుగానే విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్నుకుని సిద్ధం చేసుకున్నారు. సీజన్ ఆరంభంలో సరైన వర్షాలు కురిస్తే వెంటనే పత్తి విత్తనాలను పెట్టుకోవడంతో పాటుగా వరినార్లు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికలను రూపొందించుకుంది.

విత్తనాల అంచనా ఇలా..
వానాకాలం సాగుకు గాను వరి 1,04,294 క్వింటాళ్లు, కంది 1,413 క్వింటాళ్లు, పెసర 20 క్వింటాళ్లు, వేరుశనగ 7.5 క్వింటాళ్లు, పిల్ల పెసర 365 క్వింటాళ్లు, జనుము 2448 క్వింటాళ్లు, జీలుగ 6723 క్వింటాళ్లు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. పత్తి విత్తనాలు 15 లక్షల ప్యాకెట్లు అవసరంగా గుర్తించింది. ఇప్పటికే జిల్లాలోని విత్తనాలు డీలర్లు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ నెలాఖరు వరకు అన్ని రకాల విత్తనాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించింది. సుమారు 3 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లను వ్యాపారులు సిద్ధంగా ఉంచారు. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలకు సబ్సిడీ ఎంత అనేది నిర్ణయం కానున్నందున.. రెండుమూడు రోజుల్లో సబ్సిడీ తేలాక అన్ని మండల కేంద్రాలలోని సొసైటీల్లో జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను అందుబాటులో ఉంచేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది.

ఎరువుల నివేదిక అందజేత..
వానాకాలం సీజన్‌కు అవసరమైన ఎరువుల అంచనాలను వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. యూరియా 49,167 మెట్రిక్ టన్నులు, డీఏపీ 5925 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 2375 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 26,351 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 844 మెట్రిట్ టన్నులు అవసరమని పేర్కొంది. అయితే ఇప్పటికే యూరియా 8,127 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1240, ఎంఓపీ 874, కాంప్లెక్స్ ఎరువులు 6౦876, ఎస్ఎస్‌పీ 725 మెట్రిక్‌టన్నుల ఎరువులు ఉన్నాయి. ఇతర ఎరువుల మార్క్‌ఫెడ్, హోల్‌సేల్ డీలర్ల వద్ద సిద్ధంగా ఉంచారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తా..



వానాకాలం సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువుల సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే విత్తనాలు, ఎరువుల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించాం. వారంలో రెండుసార్లు వ్యవసాయాధికారులు, వ్యాపారులతో సమీక్ష నిర్వహిస్తాం. నకిలీ పత్తి విత్తనాలపై ప్రత్యేక నిఘాలను ఏర్పాటు చేశాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తేవాలి.
– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

క్లుప్తంగా

విద్యుదాఘాతంలో గేదెలు మృతి



మృతిచెందిన గేదెలు

చిలుకూరు: మండల పరిధిలోని ఆచార్యులగూడెంలో బుధవారం విద్యుదాఘాతంలో రెండు పాడి గేదెలు మృతిచెందాయి. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఆచార్యులగూడెం వాసి మునగాల సైదిరెడ్డికి చెందిన గేదెలు రోజుమాదిరిగానే మేత మేసేందుకు గ్రామ పరిధిలోని పొలాల్లోకి వెళ్లాయి. అక్కడ కిందకు వేలాడుతున్న కరెంట్ తీగలు తగిలి రెండు గేదెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.లక్ష ఉంటాయని బాధిత రైతు తెలిపాడు.

దేవుడి విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్ట్

భువనగిరి క్రైం: గుడిలోని దేవుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. మండలంలోని బస్వాపురం గ్రామంలో మర్రిచెట్టు కింద ఉన్న గుడిలోని శ్రీకృష్ణుడి విగ్రహాన్ని రాయితో ధ్వంసం చేసిన అదే గ్రామానికి చెందిన చిక్క రాజశేఖర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

గోడ కూలి వ్యక్తి మృతి



వెంకన్న (ఫైల్)

నాగారం/తుంగతుర్తి: పాత ఇల్లు కూల్చుతుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నాగారం మండలంలోని పసునూర్ గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం సూర్య తండా ఆవాసం గుట్టకిందితండాకు చెందిన గుగులోతు వెంకన్న(28) నాగారం మండలం పసునూర్ గ్రామంలోని నల్లగంటి సుగుణమ్మకు చెందిన పాత ఇల్లును(పెంకుటిల్లు) కూల్చడానికి తండాకు చెందిన కొంతమంది వ్యక్తులతో కలిసి బుధవారం కూలి పనికి వెళ్లాడు. పెంకుటిల్లు విప్పుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు గోడ కూలి మీదపడటంతో వెంకన్న తలకు తీవ్ర గాయమైంది. బాధితుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉంది.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి జైలుశిక్ష

భూదాన్‌పోచంపల్లి: లైంగిక వేధింపుల కేసులో పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన జె. శ్రీకాంత్‌కు బుధవారం చౌటుప్పల్ కోర్టు 6నెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. స్థానిక ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ 2016లో పోచంపల్లి పట్టణ కేంద్రానికి చెందిన ఓ మహిళను లైంగికంగా వేధింపులకు గురిచేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ జగన్మోహన్‌రెడ్డి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేశారు. ఈ కేసు చౌటుప్పల్ కోర్టులో ట్రయల్ జరగగా ఎస్‌ఐ జగన్మోహన్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సాయికుమార్, హోంగార్డు శివకుమార్ తగిన సాక్ష్యాలను అందజేశారు. దీంతో నేరం రుజువు కావడంతో నిందితుడికి 6నెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పువెలువరించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అధిక వడ్డీ ఆశచూపి మోసం

- పుడమి పేరుతో అమాయకుల నుంచి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన కేటుగాళ్లు
- కమీషన్ ఇస్తామని చెప్పి ఏజెంట్ల నియామకం
- మునుగోడు నియోజకవర్గంలోనే 300మందికి పైగా బాధితులు
- ఈడీ నోటీసుల పేరుతో అజ్ఞాతంలోకి వెళ్లిన మోసగాళ్లు
- న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన పలువురు బాధితులు

మునుగోడు: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ ఇస్తామని ఆశచూపి అమాయక ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేసింది ఓ కంపెనీ. ప్రతినెలా అధిక వడ్డీతో పాటు ప్లాట్లు ఇస్తామని చెప్పడంతో మొదట ఒక్కొక్కరు రూ.10లక్షల నుంచి రూ.20లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. వారికి కొన్నినెలల పాటు వడ్డీ చెల్లించి, ఆ తర్వాత కంపెనీ బోర్డు ఎత్తేశారు. వివరాలు.. మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరితో పాటు నల్లగొండ జిల్లాకు చెందిన మరొక వ్యక్తి కలసి హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో డివైన్ డెవలపర్స్ పేరుతో 2021లో కార్యాలయం ప్రారంభించారు. తమ కంపెనీలో పెట్టుబడి పెడితే వ్యవసాయ భూములు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి వాటిని అమ్మగా వచ్చిన లాభంతో పెట్టుబడి పెట్టిన వారికి రూ.లక్షకు ప్రతినెలా వడ్డీ రూ.10వేల చొప్పున, రూ.10లక్షలు పెట్టుబడి పెట్టిన వారికి 20నెలల పాటు ప్రతినెలా రూ.లక్ష వడ్డీతో పాటు ఒక ప్లాటు రిజిస్ట్రేషన్ చేస్తామని నమ్మించారు. ఇరవై నెలలు ముగిశాక రిజిస్ట్రేషన్ చేసిన ప్లాటు అమ్మి ఆ వచ్చిన నగదు కూడా చెల్లిస్తామని నమ్మించారు. ఇది నమ్మిన కొంతమంది పెట్టుబడి పెట్టడంతో ఆ డబ్బులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి ఓ రెండేళ్ల పాటు పెట్టుబడి పెట్టిన వారికి చెప్పిన ప్రకారం ప్రతినెలా వడ్డీతో పాటు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో ఈ వ్యాపారం బాగుందని మరికొంత మంది పెట్టుబడి పెట్టేందుకు ముందుకురావడంతో 2023లో డివైన్ డెవలపర్స్ బోర్డు మార్చి హైదరాబాద్‌లోని మేడిపల్లిలో పుడమి ప్రాజెక్ట్స్ పేరుతో నూతన కార్యాలయం ప్రారంభించారు.

ఏజెంట్లకు కమీషన్ ఇస్తామని ఆశ చూపి..

పుడమిగా ప్రాజెక్ట్స్ కంపెనీలో పెట్టుబడి పెట్టించిన ఏజెంట్లకు రూ.10 లక్షలకు నెలకు రూ.40వేల చొప్పున కమీషన్ ఇస్తామని, పెట్టుబడిదారుడికి రూ.10 లక్షలకు ప్రతినెలా రూ.65వేల వడ్డీ చెల్లిస్తామని ఆశ చూపారు. దీంతో గతంలో డివైన్ డెవలపర్స్‌లో పెట్టుబడి పెట్టిన వారు తమ వద్ద ఉన్న నగదుతో పాటు తమ స్నేహితులు, బంధువులతో దాదాపు రూ.10లక్షల నుంచి రూ.2కోట్ల వరకు పెట్టుబడులు పెట్టించారు. అలా రెండు, మూడు వందల మంది నుంచి సుమారు రూ.200 కోట్లకు పైగా వసూలు చేశారు. అందులో మునుగోడు మండలానికి చుట్టుపక్కల గల చండూరు, గట్టుప్పల్, దేవరకొండ, నల్లగొండ తదితర ప్రాంతాలకు చెందిన 200కు పైగా బాధితులు రూ.100 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారు. పెట్టుబడి పెట్టిన వారికి కేవలం రెండు నెలలు మాత్రమే వడ్డీలు చెల్లించారు. ఆ తర్వాత కంపెనీ బోర్డు ఎత్తేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయిందని, లాభాలు రావడం లేదని, భూములు అమ్మి పెట్టుబడి పెట్టిన అందరికీ తిరిగి నగదు ఇస్తామని 10నెలల పాటు నమ్మించారు. అందుకు జామీనుగా చెక్కులు కూడా ఇచ్చారు.



పెట్టుబడిగా తీసుకున్న రూ.10 లక్షలకు పుడమి ప్రాజెక్ట్స్ పేరుతో రిసిప్ట్ ఇచ్చిన నిర్వాహకులు

ఈడీ నోటీసులు వచ్చాయని అజ్ఞాతంలోకి..

పలువురు బాధితులు తమ డబ్బుల కోసం గత రెండు నెలలుగా నిర్వాహకుల ఇళ్ల చుట్టూ తిరిగినా లాభం లేక పోలీసులని ఆశ్రయిస్తామని చెప్పడంతో.. మరో రెండు, మూడు నెలలు తమకు సమయం ఇవ్వాలని, కొనుగోలు చేసిన భూములు మార్కెట్‌లో పెడితే అనుకున్న ధర రావడం లేదని నిర్వాహకులు నమ్మించే ప్రయత్నం చేశారు. కానీ కొందరు తాము మోసపోయామని తెలుసుకొని నల్లగొండ, హైదరబాద్ తదితర ప్రాంతాల్లో పోలీసులను ఆశ్రయించారు. ఇది తెలుసుకున్న నిర్వాహకులు పోలీసులు పిలిచిన సమయంలో తమకు ఈడీ నోటీసులు ఇచ్చిందని, ఈడీ కేసు పూర్తికాగానే అందరి డబ్బులు తిరిగి ఇస్తామని బాధితులకు ఒప్పంద పత్రాలు రాసిచ్చి తప్పించుకొని అజ్ఞాతంలోకి వెళ్లారు.

రూ.18లక్షలు మోసపోయాను



పలివెలకు చెందిన ఓ వ్యక్తి పుడమిలో పెట్టుబడి పెడితే అధిక వడ్డీతో పాటు ప్లాటు వస్తుందని చెబితే గతేడాది మే నెలలో రూ.18లక్షలు ఇచ్చాను. నేను ఇచ్చిన డబ్బులకు నాకు ఒక నెల వడ్డీ డబ్బులు రూ.1.80 లక్షలు ఇచ్చారు. మరుసటి నెల నుంచి వడ్డీ ఇవ్వలేదు. ఇదేమిటని నిర్వాహకుల వద్దకు వెళ్తే మూడు నెలల్లో నీ డబ్బులు నీకు ఇస్తామని కంపెనీ పేరుతో చెక్కు రాసి ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు నాకు తిరిగి డబ్బులు ఇవ్వలేదు. నాతో పెట్టుబడి పెట్టించిన వ్యక్తి గత నెల రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లాడు. నా డబ్బులు ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు.

– పోలగోని సైదులు, చీకటిమామిడి, మునుగోడు

ఆస్తులమ్మి పెట్టుబడి పెట్టాను



పుడమిలో పెట్టుబడి పెడితే అధిక వడ్డీతో పాటు ప్లాటు ఇస్తున్నారని నాకున్న ఆస్తులన్ని అమ్మి రూ.20 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టినా. రెండు, మూడు నెలల పాటు వడ్డీ ఇచ్చారు. ఆ తర్వాత పూర్తిగా మానేశారు. ఇదేమి అంటే త్వరలో ఆస్తులు అమ్మి నా డబ్బులు నాకు తిరిగి ఇస్తామని నమ్మించారు. కానీ నేటికి ఇవ్వడం లేదు. నేను మోసపోయానని తెలిసి పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశా. కానీ నాకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదు.

– రేవెల్లి మల్లేష్, మునుగోడు

బినామీల పేర్లతో ఆస్తుల కొనుగోళ్లు..

పెట్టుబడిదారుల నుంచి వసూలు చేసిన నగదుతో నిర్వాహకులు వ్యాపారం చేయకుండా నల్లగొండ, హైదరాబాద్, మునుగోడు తదితర ప్రాంతాలల్లో వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేసి తమ బంధువులు, కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయం తెలియడంతో తమని కావాలనే మోసం చేశారని, తాము చట్టపరంగా వెళ్తేనే న్యాయం జరుగుతుందని పలువురు బాధితులు వాపోతున్నారు. పెట్టుబడి పెట్టిన వారిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, పెద్ద పెద్ద వ్యాపారులు ఉండటంతో తాము బయటకు వస్తే ఎక్కడ పరువుపోతుందోనని మదన పడుతున్నారు. తమ ఆస్తులు, బంగారు ఆభరణాలు అమ్మి పెట్టుబడి పెట్టి మోసపోయిన తమకు పోలీసులు తగిన న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ
- కేసు నమోదు చేసిన పోలీసులు



కిరణ్ (ఫైల్)

చందంపేట: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన నేరెడుగొమ్ము మండలంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. నేరెడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన ఎద్దు దశరథం, లచ్చమ్మ దంపతుల కుమారుడైన ఎద్దు కిరణ్(28) మంగళవారం తల్లితో కలిసి దేవరకొండలోని పోచంపల్లి కోఆపరేటివ్ బ్యాంక్‌కు వచ్చారు. బ్యాంకులో డబ్బులు విత్‌డ్రా చేసిన అనంతరం లచ్చమ్మ స్వగ్రామానికి వెళ్లగా.. కిరణ్ స్వగ్రామానికి వెళ్లకుండా తన స్నేహితులతో కలిసి వెళ్లాడు. కాగా మంగళవారం అర్ధరాత్రి పోలేపల్లి–ఇసుకబావి మార్గమధ్యలో కిరణ్ అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదిలా ఉంటే తమ కుమారుడిని హత్య చేశారని మృతుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు దేవరకొండ రూరల్ సీఐ సురేష్, ఎస్‌ఐ సతీష్‌లు తెలిపారు. కాగా చిత్రియాల పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

మట్టి తరలిస్తున్న వారిపై కేసు



ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్న దృశ్యం

వేములపల్లి: చెరువు శిఖాన్ని ఆక్రమించి మట్టి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. వేములపల్లి మండలంలోని బుగ్గబావిగూడేనికి చెందిన కేతనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పుట్ట మహేష్ బుధవారం ఒక జేసీబీ, ఏడు ట్రాక్టర్లతో గ్రామ శివారులోని నియామల్కం (పెద్ద చెరువు)లోకి ప్రవేశించి చెరువు శిఖం హద్దులను తొలగించి మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఇరిగేషన్ ఏఈఈ ఎస్. సాయిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని జేసీబీ, ఏడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌తో పాటు జేసీబీ, ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కారు, బైక్ ఢీ.. భర్త మృతి

- భార్యకు గాయాలు
- బైక్ పూర్తిగా దగ్ధం



ధ్వంసమైన కారు

తుర్కపల్లి: కారు, బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందాడు. అతడి భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామశివారులో బుధవారం జరిగింది. వివరాలు.. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రానికి చెందిన చిన్ననగరి మహిపాల్‌రెడ్డి(44), అతడి భార్య నవనీత బైక్‌పై తుర్కపల్లి మండల కేంద్రంలో వారి బంధువుల ఇంట్లో జరుగుతున్న దశదిన కర్మకు హాజరయ్యేందుకు వస్తున్నారు. వాసాలమర్రి కమాన్ వద్ద భువనగిరి నుంచి గజ్వేల్‌కు వెళ్లే రోడ్డు పైకి వీరు వస్తుండగా.. భువనగిరి నుంచి జగదేవ్‌పూర్ వైపు కారులో వెళ్తున్న అజీమొద్దీన్ వీరి బైక్‌ను వేగంగా ఢీకొట్టాడు. కారు బైక్‌ను కొంతదూరం లాక్కెళ్లడంతో మంటలు చెలరేగి బైక్ మొత్తం కాలి బూడిదయ్యింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిపాల్‌రెడ్డి, నవనీతను 108 వాహనంలో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మహిపాల్‌రెడ్డి మృతిచెందాడు. నవనీతను మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తక్యుద్దీన్ తెలిపారు.



మహిపాల్‌రెడ్డి (ఫైల్)

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

బీబీనగర్: మండల కేంద్రంలోని ఓ వెంచర్‌లో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం చిన్నకొందూరు గ్రామానికి చెందిన బిట్కూరి మనోహర్(25) అదే గ్రామానికి చెందిన భూమికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి ప్రేమ వివాహం కారణంగా ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరగడంతో మార్చి నెలలో పురుగుల మందు తాగి భూమిక ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో మనోహర్ జైలు శిక్ష అనుభవించి విడుదలయ్యాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత మానసికంగా కుంగిపోయిన మనోహర్ బుధవారం తెల్లవారుజామున బీబీనగర్ మండల కేంద్రంలోని ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తల్లి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓటేసి వస్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి గాయాలు
- మృతుడు ఆంధ్రప్రదేశ్ వాసి

చౌటుప్పల్: ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి ఇద్దరు స్నేహితులు సొంతూర్లకు వెళ్లారు. ఓటు వేసి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. అనంతరం తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వారిలో ఒకరు దుర్మరణం చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని ఆరెగూడెం స్టేజీ సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రికి చెందిన కొనికళ్ల దీపక్‌రాజ్ (29), విశాఖపట్టణానికి చెందిన అనిరుద్ స్నేహితులు. వీరిద్దరు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో అద్దె ఇంట్లో ఉంటూ అక్కడే ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ నెల 13న ఎన్నికల్లో ఓటు వేసేందుకుగాను బస్సులో స్వగ్రామాలకు వెళ్లేందుకు వారు ప్రయత్నించారు. కానీ టికెట్లు లభించకపోవడంతో బైక్‌పై వెళ్లారు. ఓటేసి బుధవారం తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం స్టేజీ వద్ద రోడ్డుపై ఆగిన కంటైనర్ లారీని వెనుక నుండి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో దీపక్‌రాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. అనిరుద్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవరెడ్డి తెలిపారు.

గుండెపోటుతో ఆస్పత్రి వాచ్‌మన్ మృతి

- కుటుంబ సభ్యుల ఆందోళన

సూర్యాపేట: ఆస్పత్రిలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేసే వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని సీతారాంపురానికి చెందిన నకిరేకంటి పుల్లయ్య(63) స్థానికంగా కొత్త బస్టాండ్ వద్ద గల ఆర్వీ ఆస్పత్రిలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి విధులకు హాజరైన ఆయన బుధవారం ఉదయం ఆస్పత్రి ఆవరణలోనే గుండెపోటుకు గురై మృతిచెందాడు. ఆస్పత్రి సిబ్బంది గమనించి పుల్లయ్య కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. కాగా పుల్లయ్య మృతిపై అనుమానం ఉందని ఆస్పత్రి ఎదుట అతడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మృతుడి కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

24న కృషి విజ్ఞాన కేంద్రంలో వరి విత్తన మేళా

త్రిపురారం: మండల పరిధిలోని కంపాసాగర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో 24వ తేదీన వరి విత్తన మేళా నిర్వహించనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు, వ్యవసాయ పరిశోధనా స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జేజీఎల్ 27356 (అతి చిన్న గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ.1100, కేఎన్ఎమ్ 118(దొడ్డు గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ.1100, జేజీఎల్ 24423 (దొడ్డు గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ.1100 ఉన్నట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలకు 7702544771, 9848430317 నంబర్లను సంప్రదించాలన్నారు. అదే విధంగా వ్యవసాయ పరిశోధన స్థానం కంపాసాగర్ ఆధ్వర్యంలో కేఎన్ఎమ్ 118 (దొడ్డు గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ.1100, ఎమ్‌టీయూ 1010 (దొడ్డు గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ.1100, కేపీఎస్ 2874 (సన్న గింజ రకం) 20 కేజీల బ్యాగ్ ధర రూ.1556, కేపీఎస్ 6521 (సన్న గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ. 1200గా ఉన్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99499301819, 9912534831 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వికసించిన మే పుష్పం

నేరేడుచర్ల మున్సిపాలిటీలోని శ్రీసాయి శ్రీనివాస్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న నిమ్మగడ్డ సుబ్బారావు ఇంట్లోని పూల కుండీలో నాటిన మే పుష్పం వికసించింది. చుట్టుపక్కల వారు వచ్చి మే పుష్పాన్ని చూసి వెళ్తున్నారు. – నేరేడుచర్ల



తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

- మృతుడు చింతపల్లి మండలం సాయిరెడ్డిగూడెం వాసి



ఘటనా స్థలంలో తేజ మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం సాయిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గండేటి తేజ(50) కొన్నేళ్ల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మజీద్‌పూర్ గ్రామానికి వలస వచ్చాడు. ఆయన తాటిచెట్లు ఎక్కి కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం బాటసింగారంలోని దొడ్డ శాంతికుమార్ వ్యవసాయ భూమిలో తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సంతోష ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.


వృద్ధ దంపతులకు దాతల సాయం



వృద్ధ దంపతులకు నిత్యావసర సరుకులు, బియ్యం అందజేస్తున్న దాతలు

మునగాల(కోదాడ): మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన నూకమళ్ల రాములు, అక్కమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు సంతానం. వారికి పెళ్లిళ్లు చేశారు. గతంలోనే అక్కమ్మ కాలు తొలగించడంతో రాములు ఆమెకు సపర్యలు చేస్తూ ఇంట్లోనే ఉంటున్నాడు. ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్‌తోనే జీవనం సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి దీనగాథ గురించి 'వృద్ధ దంపతులను ఆదుకోరూ..' అనే శీర్షికన ఈ నెల 13న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందించారు. గ్రామానికి చెందిన యశోద ఫౌండేషన్ సంస్థ వారు రూ.2వేల విలువైన కిరాణ సరుకులు, చల్లా గుర్వయ్య రూ.1000, పోలిశెట్టి నవీన్‌కుమార్ 25కేజీల బియ్యాన్ని బుధవారం వృద్ధ దంపతులకు అందజేశారు. ముందుముందు కూడా వృద్ధ దంపతులను ఆదుకుంటానని యశోద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరాల రుక్మారావు తెలిపారు. కార్యక్రమంలో యశోద ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు, రిటైర్డ్ హెచ్ఎం ఓరుగంటి రవి, సభ్యులు చల్లా గుర్వయ్య, ఆర్ఎంపీ వైద్యుడు గోలి పూర్ణశంకర్, బాలెబోయిన ఉపేందర్, బోనాల శ్రీనివాస్, కుమ్మరి వెంకన్న, బోనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం



మట్టయ్య (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం మిర్యాలగూడ మండలంలోని కొత్తగూడెం వద్ద జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని వాసవీనగర్‌కు చెందిన గౌరు మట్టయ్య(69) మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామంలో గల దయానంద్ వృద్ధాశ్రమంలో గత 10 నెలలుగా ఉంటున్నాడు. వస్తువులు కొనుగోలు చేసుకునేందుకు బుధవారం ఆయన ఆశ్రమం నుంచి నడుచుకుంటూ వెళ్తూ అద్దంకి–నార్కట్‌పల్లి ప్రధాన రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి ఏపీలోని పల్నాడు జిల్లా నరసరావుపేట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో మట్టయ్య ఎగిరి కిందపడిపోవడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు గౌరు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరికోత మిషన్‌ను తరలిస్తున్న డీసీఎం బోల్తా

- ముగ్గురికి గాయాలు



ధ్వంసమైన డీసీఎం, వరికోత మిషన్

శాలిగౌరారం: వరికోత మిషన్‌ను తరలిస్తున్న డీసీఎం బోల్తా పడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామశివారులో 365వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణానికి చెందిన బచ్చు శ్రీనివాస్ తన వరికోత మిషన్‌ను వరంగల్ జిల్లా నర్సంపేటలో వరికోతలు కోసేందుకు మంగళవారం డీసీఎంపై తరలిస్తున్నాడు. అర్ధరాత్రి శాలిగౌరారం మండలంలోని 365వ నంబర్ జాతీయ రహదారిపై నుంచి వెళ్తుండగా పెర్కకొండారం గ్రామశివారులోని తాళ్లకుంట వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో డీసీఎం డ్రైవర్ బత్తుల శివరాజు పక్కకు తిప్పగా.. అదుపు తప్పి రహదారి కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌తో పాటు క్లీనర్ పరిమల దాలి, వరికోత మిషన్ డ్రైవర్ రాయి చంద్రశేఖర్‌కు గాయాలయ్యాయి. వరికోత మిషన్, డీసీఎం నుజ్జునుజ్జయ్యాయి. గాయాలపాలైన వారిని 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి.. అక్కడ నుండి బుధవారం హైదరాబాద్‌కు తరలించినట్లు బాధితుల కుటుంబ సభ్యులు తెలిపారు. వరికోత మిషన్ యజమాని బచ్చు శ్రీనివాస్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒకదానికొకటి ఢీకొన్న మూడు కార్లు



పెద్దకాపర్తి శివారులో జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన కారు

- చిట్యాల శివారులో ఘటన
- విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం



విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో కావేరి జిన్నింగ్ మిల్లు వద్ద జాతీయ రహదారిపై బుధవారం విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మూడు కార్లు వరుసగా ఒకదానికొకటి వెనుక నుంచి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్లు ధ్వంసమవ్వగా.. వాటిల్లో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కార్లలోని వ్యక్తులు జాతీయ రహదారిపైనే ఒకరితో మరొకరు వాగ్వాదం చేసుకుంటూ ఉండిపోయారు. దీంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు కాసేపు ట్రాఫిక్ జాం ఏర్పడింది. కొద్దిసేపటికి పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది అక్కడకు చేరుకొని ప్రమాదానికి గురైన కార్లను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.